క్లుప్తంగా

మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకుడు మహేష్

దుబ్బాకటౌన్: తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయే అని ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక మండలం పెద్దగుండవెల్లికి చెందిన బీజేపీ నాయకుడు కొర్ల మహేష్‌తో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌కే మూడోసారి పట్టం కడతారని కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అన్నారు. సర్వేలు 50 శాతం పైగా ఓట్లు బీఆర్ఎస్‌కే వస్తాయని స్పష్టం చేస్తున్నాయన్నారు. దుబ్బాకలో భారీ మెజార్టీతో తాను విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఏమీ చేయలేదని, ఈసారి బీజేపీకి ఓట్లు వేయమంటు ప్రజలు ధైర్యంగా చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, సర్పంచ్ సద్ది రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈటలను కలిసిన ముదిరాజ్ సంఘం నేతలు



ఈటల రాజేందర్‌తో ముదిరాజ్ సంఘం సభ్యులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను మంగళవారం మండలంలోని వట్టిపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో సత్యనారాయణ, శ్రీను, తిరుపతి, కనకయ్య తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ రాజ్యం వస్తుంది



మాట్లాడుతున్న నియోజకవర్గ కోఆర్డినేటర్ సుజిత్ కుమార్

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వస్తుందని పీసీసీ ఎన్నికల కమిటీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మల్యాల సుజిత్ కుమార్ పేర్కొన్నారు. బెజ్జంకి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, మైనార్టీలను మోసం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. సంక్షేమ పథకాలు పేదలకు అందలేదని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో మానకొండూర్ నుంచి పోటీచేస్తున్న డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. అనంతరం బెజ్జంకిలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, శ్రావణ్, ప్రభాకర్, మల్లేశం, శ్రీకాంత్, నర్సయ్య, రాములు, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ వివేక్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఐదు రోజుల క్రితం ఓ మహిళ తన సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. మంగళవారం ఎస్ఐ వివేక్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చాపగానీతండా గ్రామం పరిధి ఇప్పల తండాకు చెందిన మాలోతు సునీత తన సెల్‌ఫోన్ పొగొట్టుకుంది. బాధితురాలు సీఈఐఆర్‌లో తన వివరాలు నమోదు చేసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టి చోరీ చేసిన వ్యక్తి నుంచి ఫోన్ స్వాధీనం చేసుకొని మహిళలకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ సరఫరా బంద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట డివిజన్ పరిధిలోని 33 కేవీ, 11 కేవీ విద్యుత్ సరఫరా లైన్‌ల మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సిద్దిపేట డివిజనల్ ఇంజనీర్ మహేశ్‌కుమార్ మంగళవారం తెలిపారు. హనుమాన్ నగర్, గణేష్‌నగర్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, కొత్త బస్టాండ్, భరత్ నగర్, శ్రీనగర్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, టీచర్స్ కాలనీ, ఎన్సాన్‌పల్లి మెడికల్ కళాశాల, డీఎక్స్‌న్ కంపని పరిసర ప్రాంతాలతోపాటుగా, మిట్టపల్లి, ఎల్లుపల్లి గ్రామాల పరిధిలో బుధవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



కొండపాక(గజ్వేల్): వెలికట్టలో చీరలను పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రావు



దుబ్బాకలో జమ్మి చెట్టుకు పూజ చేస్తున్న చైర్‌పర్సన్ గన్నె వనిత, కౌన్సిలర్లు



దుబ్బాకలో రావణ దహన దృశ్యం

అంబరాన్నంటిన సంబురం



బెజ్జంకిలో లక్ష్మీనర్సింహ స్వామి ఊరేగింపు

దసరా పండుగ అంబరాన్నంటింది. సోమవారం చిన్నాపెద్ద నూతన వస్త్రాలు ధరించి దుర్గామాత పూజలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల శివారుకు వెళ్లి పాల పిట్టను వీక్షించారు. జమ్మిఆకు పంచుకుంటూ పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆయా మండలపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన రావణ దహన కార్యక్రమాన్ని జనం వీక్షించారు. ఈ కార్యక్రమాన్ని సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించేందుకు యువకులు పోటీ పడ్డారు.

– సాక్షి నెట్ వర్క్



జగదేవ్‌పూర్(గజ్వేల్): చాట్లపల్లిలో పూజ చేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు



నంగునూరు(సిద్దిపేట): నంగునూరులో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు



సిద్దిపేట జోన్: సిద్దిపేటలో పాలపిట్టతో చిన్నారులు



దుబ్బాకరూరల్: కుటుంబ సభ్యులతో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు



నంగునూరు(సిద్దిపేట): పాలమాకులలో అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



మిరుదొడ్డి(దుబ్బాక): మోతెలో ఆయుధ పూజలో పాల్గొన్న గ్రామస్తులు



హుస్నాబాద్: శమి పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత



చేర్యాల(సిద్దిపేట): చేర్యాలలో దసరా వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూపరాణి



గజ్వేల్‌రూరల్: ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(పల్లెపహాడ్)లో జమ్మిని కొట్టేందుకు వెళ్తున్న గ్రామస్తులు

మంత్రికి దసరా శుభాకాంక్షలు



మంత్రి హరీశ్‌రావుతో బీఆర్ఎస్ నేతలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): దసరా పండుగను పురస్కరించుకుని ప్రముఖులు మంత్రి హరీశ్‌రావుకును కలిసి మంగళవారం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అమరేందర్ తదితరులు ఉన్నారు.

కొండపాక(గజ్వేల్): బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని మండల ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావును కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, పీఏసీఎస్ వైస్ ప్రెసిడెంట్ పిస్క అమరేందర్ తదితరులు ఉన్నారు.



మంత్రి హరీశ్‌రావుతో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్

మిత్రుడి కుటుంబానికి చేయూత

గజ్వేల్‌రూరల్: మిత్రుడి కుటుంబానికి బాల్యమిత్రులు చేయూత అందించారు. మండల పరిధిలోని జాలిగామకు చెందిన కుమ్మరి భాస్కర్ వారం క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బాల్యమిత్రులు మంగళవారం మిత్రుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. తమ మిత్రుడి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ముగిసిన త్రిరాత్రోత్సవాలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించిన త్రిరాత్రోత్సవాలు మంగళవారం ముగిసాయి. అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామి పుష్కరిణి(ధర్మగుండం)లో త్రిశూల స్నానం చేయించారు. భక్తులు కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ అంజయ్య, పర్యవేక్షకులు చంద్రశేఖర్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, స్థానాచారి మల్లయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శనివారం వారం ఆలయం మూసి వేత

చంద్రగ్రహణం కారణంగా ఈనెల 28వ తేదీన స్వామివారి ఆలయం మూసి వేస్తున్నట్లు ఆలయ ఈఓ బాలాజీ మంగళవారం తెలిపారు. శనివారం రాత్రి రాహుగ్రస్త చంద్రగ్రహణము సంభవించడంతో ఆలయం శనివారం సాయత్రం 4.15 గంటల నుంచి ప్రధానాలయంతోపాటు అనుబంధ దేవాలయాలను మూసివేసి ఆదివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు.



అమ్మవారికి త్రిశూల స్నానం చేయిస్తున్న పూజారులు

ఇంట్లోకి వెళ్లకుండా కంచె ఏర్పాటు



కంచె వేసిన దృశ్యం

తూప్రాన్: ఇంట్లోకి వెళ్లకుండా కంచె ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో దసరా పండుగను ఊరికి దూరంగా జరుపుకోవాల్సి వచ్చిందని ఆ కుటుంబం వాపోయింది. ఈ సంఘటన మండలంలోని వెంకటరత్నాపూర్ గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటరత్నాపూర్ గ్రామానికి చెందిన నాగులపల్లి మహిపాల్‌రెడ్డి కొంత కాలంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజుల క్రితం స్వగ్రామంలోని తన ఇంటి నెంబరు 1–10/1కు వచ్చేసరికి ఇంటికి వెళ్లకుండా గ్రామానికి చెందిన యాదిరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి కంచె వేసినట్లు పేర్కొన్నాడు. ఈ విషయాన్ని ఎస్పీ, కలెక్టర్, ఆర్డీఓలకు ఫిర్యాదు చేసినా వారు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారులు, నాయకులు స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరాడు.

సంక్షిప్త వార్తలు

◆ **బీఆర్ఎస్‌లో చేరిక**



మిరుదొడ్డి(దుబ్బాక): బీజేపీ కిసాన్ మోర్చా ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ కన్వీనర్ సత్తు రాజిరెడ్డి మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆయనకు గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాజిరెడ్డి స్వగ్రామమైన మిరుదొడ్డిలో బీజేపీకి మంచి పట్టు ఉంది. ఆయన బీఆర్ఎస్‌లో చేరడంతో బీజేపీకి ఎదురు దెబ్బ తగిలినట్లయ్యింది.

◆ **ఎంపీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు**

తొగుట(దుబ్బాక): దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని మండల బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. పోతారంలోని ఆయన స్వగృహంలో కలిసిన నేతలు ఎంపీకి జమ్మి ఆకు ఇచ్చి అలయ్ బలయ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దుబ్బాక గడ్డపై బీఆర్ఎస్ జండా ఎగరలన్నారు. సీఎం కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఎంపీని కలిసిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ సురేశ్‌గౌడ్, నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింలు ఉన్నారు.

◆ **బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలి**

తొగుట(దుబ్బాక): మండంలోని పెద్ద మాసాన్‌పల్లిలో బీఆర్ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జి ప్రభాకర్ వర్మ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాకలో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. విభేదాలను పక్కన పెట్టి పార్టీ అభ్యర్థి గెలుపుకోసం పనిచేయాలని సూచించారు. ఉప సర్పంచ్ రాజిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎల్లారెడ్డి, నాయకులు శ్రీనివాస్, ప్రవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **కనీస వసతులు కల్పించాలి**

చేర్యాల(సిద్దిపేట): స్మశాన వాటిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామస్తులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు కత్తుల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వైకుంఠధామంలో కనీస వసతులు లేవన్నారు. అలాగే స్మశాన వాటిక వరకు రోడ్డు సరిగా లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని, అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళనలో మాజీ ఎంపీటీసీ కోట వెంకటస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.



◆ **కాంగ్రెస్‌లో చేరికలు**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన పలువురు మంగళవారం బెజ్జంకి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ అభ్యర్థి కవ్వంపెల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ **సన్నాహక సదస్సు జయప్రదం చేయండి**

గజ్వేల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ఈనెల 28వ తేదీన నిర్వహించ తలపెట్టిన ఎమ్మార్పీఎస్ జిల్లా సన్నాహక సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రజ్ఞాపూర్‌లో సన్నాహక సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం**

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణాగౌడ్ తెలిపారు. సమావేశానికి మంత్రి హరీశ్ రావు, ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

◆ **వ్యక్తిపై కేసు నమోదు**

దుబ్బాకరూరల్: మండలంలోని చీకోడ్ గ్రామంలో 'చీకోడ్ సాటింపు' అనే వాట్సాప్ గ్రూపులో రెచ్చగొట్టే పోస్టు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ గంగరాజ్ మంగళవారం తెలిపారు. ×చీకోడ్ సాటింపు× వాట్సప్ గ్రూపులో పున్నపు రాజు శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా అభ్యంతరకర పదాలతో సీఎం ఫొటో పోస్ట్ చేశాడు. చీకోడ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం చేసిన వారు, గ్రూపు అడ్మిన్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తేనెటీగల దాడిలో..

సిద్దిపేటకమాన్: తేనెటీగల దాడిలో పలువురు గాయపడ్డారు. ఈ సంఘటన సిద్దిపేటలో మంగళవారం జరిగింది. సిద్దిపేటకు చెందిన వృద్ధురాలు కళావతి (80) సోమవారం దసరా పండుగ సందర్భంగా రంగదాంపల్లి హనుమాన్ ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి దర్శనానికి వెళ్లింది. దర్శనం అనంతరం బయటకు వస్తున్న క్రమంలో ఒక్కసారిగా కుప్ప కూలింది. వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. మంగళవారం ఆమె అంత్యక్రియలు నిర్వహిస్తుంగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో 16 మంది గాయపడ్డారు. గాయపడిన వారికి ప్రభుత్వ ఆసుత్రిలో చికిత్స చేశారు.

మద్యం స్వాధీనం

సిద్దిపేటకమాన్: అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం సిద్దిపేట వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని నల్లపోచమ్మ నగర్‌కు చెందిన భాస్కర్ అక్రమంగా మద్యం అమ్ముతున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా రూ.9 వేల విలువగల 22 లీటర్ల మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.